VISION BHARATH REPORTER
విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న
"విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు
జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్లగడ్డ
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం17-07-2024 సంపుటి : 06 సంచిక : 301 పేజీలు : 8 వెల : రూ 3-00

## నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన సీబీఐ




న్యూఢిల్లీ:జులై16 దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యూజీ 2024 పేపర్ లీకేజీ అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (అఃఐ) ముమ్మరంగా దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే కేసుతో సంబంధం ఉన్న పలువురిని అరెస్ట్ చేసి విచారిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో ఇద్దరిని సీబీఐ అరెస్ట్ చేసింది.అరెస్టైన వారిని బీహార్‌లోని పాట్నాకు చెందిన పంకజ్ కుమార్, జార్ఖండ్‌లోని హజారీబాగ్‌కు చెందిన రాజు సింగ్‌గా గుర్తించారు. పంకజ్ కుమార్ పేపర్ లీక్ మాఫియాలోని వ్యక్తిగా అధికారులు భావిస్తున్నారు. ఇతడు నీట్-యూజీ ప్రశ్నపత్రాలను దొంగలించినట్లు ఆరోపించారు. ఇక ప్రశ్నపత్రాన్ని లీక్ చేయడంలో పంకజ్‌కు రాజు సహాయం చేసినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న రాకీ అలియాస్ రాకేష్ రంజన్‌తో సహా మరో 13 మంది నిందితులను సీబీఐ జూలై 12న బీహార్‌లో కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు నీట్-యూజీ పరీక్షల్లో అవకతవక౯లపై దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం గత గురువారం విచా రణ జరిపిన విషయం తెలిసిందే. కేంద్రం, ఎన్‌టీఏ దాఖలు చేసిన అఫి డవిట్లను సుప్రీం కోర్టు స్వీకరించింది. ఈ కేసులో వాదనలు జరిగే ముందు అఫిడవిట్లను పరిశీలించాల్సి ఉండడంతో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణను జులై 18 (గురవారానికి)కి వాయిదా వేసింది.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కోటీశ్వర్ సింగ్, ఆర్. మహాదేవన్ నియామకం



న్యూఢిల్లీ: జూలై 16, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కోటీశ్వర్ సింగ్, ఆర్.మహాదేవన్ ల నియామకాన్ని కేంద్రం ప్రకటించింది. జస్టిస్ కోటీశ్వర్ సింగ్ జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తుండగా, ఆర్. మహాదేవన్ మద్రాస్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు.సింగ్ గత ఫిబ్రవరిలో ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన ఫిబ్రవరి 15, 2023న ప్రమాణ స్వీకారం చేశారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన మొదటి వ్యక్తి ఆయన.జస్టిస్ ఆర్. మహాదేవన్ మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, వెనుకబడిన తరగతికి చెందినవారు. మద్రాసు లా కాలేజీలో లా డిగ్రీ పూర్తి చేసి 1989లో లాయర్‌గా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. 25 సంవత్సరాలు, ఆయన పరోక్ష పన్నులు, కస్టమ్స్,సెంట్రల్ ఎక్సైజ్ విషయాలపై దృష్టి సారించి సివిల్, క్రిమినల్ , రిట్ కేసులలో నైపుణ్యం సాధించారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## సుప్రీంకోర్టులో కేసీఆర్ కు ఊరట



న్యూఢిల్లీ, జూలై 16, కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్ల కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేసేందుకు నియమించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ కమిషన్ చైర్మన్ గా ఉంటూ ప్రెస్ మీట్ ఎలా పెడతారని..తన అభిప్రాయాల్ని ఎలా వెలిబుచ్చాతారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తి న్యాయం చెప్పడమే కాకుండా.. నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. విద్యుత్ కమిషన్ చైర్మన్ గా మరొక జడ్జిని నియమించాలని సూచించారు. చీఫ్ జస్టిస్ సూచనకు తెలంగాణ ప్రభుత్వ లాయర్ అంగీకరించారు. మధ్యాహ్నం తర్వాత కొత్త విద్యుత్ కమిషన్ చైర్మన్ గా ఎవరిని నియమిస్తారో చెప్పాలన్నారు. విద్యుత్ కమిషన్ నియామకం, ఆ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి ముందుగానే అభిప్రాయాలు చెప్పడం వంటి వాటిపై కేసీఆర్ మొదటి నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ యగా.. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ గులాబీ బాస్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. కమిషన్ చైర్మన్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముందే నిర్ణయానికి వచ్చినట్లుగా ప్రెస్ మీట్లు పెడుతున్నారని కోర్టుదృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ముందు హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ అనుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1952, విద్యుత్తు చట్టం-2003కి అది విరుద్ధమని.. దాన్ని రద్దుచేయాలని కేసీఆర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తు కొనుగోళ్లపై వివాదం ఉంటే.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండళ్లు తేల్చాలే తప్ప.. దానిపై విచారించే అధికారం కమిషన్‌కు లేదని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ .. ప్రస్తుత విద్యుత్ కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ పెట్టడంపైనే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మార్చాలన్నారు. కేసీఆర్ వ్యక్తం చేసిన అభ్యంతరాల్లో అది కూడా ఒకటి. కొత్త న్యాయమూర్తి పేరును చెప్పిన తర్వాత విచారణ కొనసాగించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే.. అది కేసీఆర్ కు ఇబ్బందేనని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఇక కేసీఆర్ కు అన్ని దారులు మూసుకుపోయినట్లే అనుకోవచ్చు. కమిషన్ విచారణను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అసలు కమిషనే చట్ట విరుద్ధం కాబట్టి విచారణ ఏం ఉండదని అనుకుంటున్నారు.



## ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం

### ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం!

అమరావతి జులై16 ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే కొత్త ఇసుక విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొత్త ఇసుక పాలసీకి సంబంధించిన విధివిధానాలను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయనుంది.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో మంత్రివర్గం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కేబినెట్ చర్చించింది. పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లింపుపై విధివిధానాలను ఖరారు చేసేందుకు కమిటీ వేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ముగ్గురు మంత్రులతో కమిటీని నియమించింది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.పౌరసరఫరాల శాఖ రూ.2వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు నిమిత్తం ఎన్సీడీసీ నుంచి రూ.3200 కోట్ల రుణానికి వ్యవసాయ, సహకార కార్పొరేషన్‌కు ప్రభుత్వ గ్యారంటీకి కేబినెట్ ఆమోదం తెలిపింది.ఏపీ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా కేబినెట్ భేటీలో చర్చించారు. జూలై 22వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టాలా? ఆర్డినెన్స్ తీసుకురావాలా? అనే దానిపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇక శ్వేతపత్రాలను కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

## ఏపీ శాసన మండలి సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్ నియామకం




అమరావతి జులై16, )ఏపీ శాసన మండలి సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తూ శాసన మండలి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రామాచార్యులు రాజీనామాతో ఖాళీ అయిన ఈ పోస్టును ప్రసన్నకుమార్‌తో ఏపీ ప్రభుత్వం భర్తీ చేసింది.ఖమ్మం జిల్లాకు చెందిన సూర్యదేవర ప్రసన్న కుమార్ గతంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. లోక్‌సభ స్పీకర్‌కు ఓఎస్డీగా, ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయ ఓఎస్డీగా వ్యవహరించారు. ఈ ఏడాది జనవరిలో తెలంగాణ అసెంబ్లీ సలహాదారుగా నియమితులయ్యారు.గత ప్రభుత్వం హయాంలో రామాచార్యుల నియామకం జరిగింది. ఆయన పదవీకాలం పూర్తయినా కొనసాగిస్తూ వచ్చింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రిటైర్ అయినా కొనసాగుతున్న అధికారులంతా రాజీనామా చేయాలని కూటమి సర్కారు ఆదేశిస్తూ సర్క్యులర్‌ను జారీ చేసింది. దాంతో ఆయన జూలై 9వ తేదీన రాజీనామా చేయాల్సి వచ్చింది. రాజీనామాను శాసన మండలి చైర్మన్ మోసెన్ రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి అందజేశారు.

## తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకం

### విద్యా వ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్బోధ



హైదరాబాద్ జూలై 16, తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకమని, విద్యా వ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.85 వేలు ఖర్చు పెడుతోందన్నారు. ప్రజాపాలన, ఖరీఫ్ సాగు, సీజనల్ వ్యాధులు, వన విద్య, మహిళా శక్తి, డ్రగ్స్ నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ తదితర అంశాలపై మంగళవారం కలెక్టర్లు, పోలీస్ కమిషనర్‌లు, ఎస్పీలతో సిఎం రేవంత్ రెడ్డి సమావేమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు విశ్వాసం కల్పించాలని, ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను గుర్తించాలని, ప్రజలకు లబ్ధి చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకునేలా కలెక్టర్లు పని చేయాలన్నారు. డిసెంబర్ 24న కలెక్టర్లతో తొలిసారి భేటీ నిర్వహించామని, ఎన్నికల కోడ్ ముగియగానే కలెక్టర్ల బదిలీలు నిర్వహించామని, కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఉన్నారని, తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చని, తెలంగాణ మీ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఆలోచన ఏంటో తెలుసుకోవాలని, ఏసి గదులకే పరిమితమైతే కలెక్టర్లకు కూడా సంతృప్తి ఉండదని, మీ ప్రతి చర్య ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలన అందించాలని రేవంత్ ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధి ముందుకు తీసుకెళ్లే బాధ్యత కలెక్టర్లపై ఉందని, క్షేత్రస్థాయిలో వారు పర్యటించాల్సిందేనన్నారు.

# సంపాదకీయం

బుధవారం 17-07-2024

## కమలానికి మరాఠ శాపం...

బిజెపి పరిస్థితి మరింత దిగజారనుందా? ఆ పార్టీ బలం క్రమేపీ తగ్గిపోతుందా? 2029 ఎన్నికల్లో కమలం పార్టీ అధికారం కోల్పోవడం ఖాయమా? కాషాయ దళానికి మిత్రులు సైతం కరువు అవుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్టబోయిన విధంగా అధికారంలోకి రాగలిగారు. నెలరోజుల తిరగకముందే అసెంబ్లీ ఉప ఎన్నికల రూపంలో బిజెపికి గట్టి షాక్ తగిలింది. దానికి మించి కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడం కూడా.. ఆ పార్టీని కలవరపెడుతోంది. ముమ్ముందు ఇలాంటి ఓటములు తప్పవని సంకేతాలు వస్తుండడంతో ఆందోళన నెలకొంది. ప్రాంతీయ పార్టీలను చీల్చి చెండాడడంలో బిజెపి చేసిన రాజకీయం అందరికీ తెలిసిన విషయమే. సుదీర్ఘకాలం నమ్మదగిన మిత్రుడిగా ఉన్న నవీన్ పట్నాయక్ ను దారుణంగా దెబ్బతీసింది బిజెపి. 2000 నుంచి 2024 వరకు బిజెపిని చాలా గౌరవించారు. బిజెపి నాయకత్వానికి ఎదురెళ్లిన దాఖలాలు కూడా లేవు. బిజెపి ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా.. కష్టంలో ఉన్నప్పుడు మాత్రం అండగా నిలిచారు. కానీ అదే నవీన్అనారోగ్యానికి గురయ్యారని.. ఆయనకు పాలన చేతకాదని చెప్పుకొచ్చారు. శ్రీ జగన్నాథుడి రత్న భాండాగారం తెరవలేని అసమర్థుడని ముద్రవేశారు. దేశంలోనే ఒక ఔన్నత్యమైన ముఖ్యమంత్రిని పదవి నుంచి దూరం చేశారు. భారతీయ జనతా పార్టీ చేసిన రాజకీయం పుణ్యమా అని మహారాష్ట్రలో రెండు శివసేన పార్టీలు, రెండు ఎన్సీపీలు పుట్టుకొచ్చాయి. ఆ రెండు పార్టీలను చీల్చి.. వాటి డూప్లికేట్స్ కు అసలైన హోదా కల్పించారు. అసలైన పార్టీలు అంత వేగంగా నిర్వీర్యం అవుతాయి అన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఒక వ్యక్తి, కుటుంబం మీద ఆధారపడి ఉంటాయి. వేరే వారికి ఆ పార్టీని కట్టబెట్టినంత మాత్రాన ప్రజలు మారిపోరు. ఇప్పుడు మహారాష్ట్రలో కనిపిస్తుంది అదే. బిజెపి పట్ల మొన్నటి వరకు సానుకూలత ఉన్నా.. తమ రాష్ట్రంలో రాజకీయంగా వ్యవహరించిన తీరుప్రజలు గ్రహించారు. వచ్చే నాలుగు నెలల్లో జరిగే ఎన్నికల్లో తమ శక్తి యుక్తులను చూపించనున్నారు. మహారాష్ట్రలో బిజెపి చేసిన రాజకీయం కారణంగా అక్కడ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఉద్ధవ్ నేతృత్వంలోని అసలైన శివసేన, శరద్ పవర్ నేతృత్వంలోని అసలైన ఎన్సిపి మళ్లీ పట్టు నిరూపించుకున్నాయి. మహారాష్ట్రలో విపక్షాల ఐక్యతకు బిజెపి చర్యలే కారణం. వచ్చే ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పోటీకి కాంగ్రెస్, శివసేన, ఎన్సిపి ఇప్పటికే చర్చలు ప్రారంభించాయి. షిండే ప్రభుత్వం పై ప్రజల్లో సానుకూలత లేదని పార్లమెంట్ ఎన్నికలు నిరూపించాయి. అందుకే కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు ప్రారంభించింది. సానుకూలంగా సర్వేలు సైతం వస్తున్నాయి. కేవలం బిజెపి కుటిల రాజకీయాల కారణంగా దారుణ దెబ్బ తగలడం ఖాయం. ఈ ఏడాది చివర్లో జరగనున్న మహారాష్ట్ర ఎన్నికలతో దేశంలో బిజెపి పతనం ప్రారంభం అవుతుందని విశ్లేషణలు సైతం ప్రారంభమయ్యాయి. అందుకే ఇప్పుడు మోదీజాగ్రత్తగా నడుచుకుంటున్నారు. మిత్రులతో సఖ్యతగా గడుపుతున్నారు. అయితే మూడోసారి అధికారంలోకి రావడంతో వ్యతిరేకత సాధారణమని.. దానిని అధిగమించగలమని బిజెపి చెబుతోంది. బిజెపికి ఇప్పుడున్న మిత్రులు కూడా ఎన్ని రోజులు ఉంటారో తెలియదు. ముఖ్యంగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తరచు కూటమిలను మార్చుతుంటారు. ఆయనకు ప్రధానమంత్రి పదవి చేయాలని బలంగా ఉంది. అది వీలు కాకపోవడం వల్లే ఇండియా కూటమి నుంచి ఎన్డీఏలోకి వచ్చారు. బీహార్అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే ఆయన తప్పకుండా బిజెపికి ఎదురు తిరుగుతారు. ఏపీ సీఎం చంద్రబాబు సైతం బిజెపిని నమ్మడం లేదు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగానే ఆయన ఎన్డీఏతో సఖ్యతగా ఉన్నారు. తనను నమ్మిన ప్రాంతీయ పార్టీలను బిజెపి ఏ స్థాయిలో మోసం చేసిందో అందరికీ తెలిసిన విషయమే. అందుకే ప్రస్తుతం మిత్రులు సైతం అంటీ ముట్టనట్టుగా మాత్రమే ఉన్నారు. మహారాష్ట్రలోప్రతికూల ఫలితాలు వచ్చిన మరుక్షణం నుంచి బిజెపి గ్రాఫ్ గణనీయంగా తగ్గుముఖం పట్టడం ఖాయం. కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటే.. గత పదేళ్లలో బిజెపి బాధిత పార్టీలన్నీ హస్తం గూటికి చేరడం ఖాయం. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీఅధికారానికి దగ్గరగా వస్తే.. బిజెపి పతనం ప్రారంభం కావడం ఖాయం. అయితే ఇప్పటివరకు ఉత్తరాధి రాష్ట్రాలనే బిజెపి నమ్ముకుంది. ఇప్పుడు అదే రాష్ట్రాల్లో బిజెపికి ప్రతికూల ఫలితాలు వస్తున్నాయి. చివరకు బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో సైతం ప్రతికూల ఫలితాలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో బీజేపీకి మిత్రులు చాలా తక్కువ. బిజెపికి నమ్ముకున్న చాలా పార్టీలు మూల్యం చెల్లించుకున్నాయి. మహారాష్ట్రలో శివసేన, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్ ఇదే మాదిరిగా మూల్యం చెల్లించుకున్నారు. నమ్మదగిన మిత్రులుగా ఉన్నటువంటి పార్టీలనే విభజించింది బీజేపీ.

# అక్రమ తొలగింపులు ఆపాలి :- సిఐటీయు



విభారె న్యూస్ డోన్ ప్రతినిధి:-జూలై 16 అక్రమ తొలగింపులు ఆపాలని విధుల నుండి తొలగించిన రాజశేఖర్ ను వెంటనే విధులలోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం అమకతాడు టోల్ ప్లాజా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అమకతాడు టోల్ ప్లాజా నందు ఆ యూనియన్ అధ్యక్షులు అయ్యరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తున్న రాజశేఖర్ ను టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజశేఖర్ స్వగ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు టోల్ ప్లాజా యాజమాన్యంపై రాజకీయంగా ఒత్తిడి తెప్పించి గత నెల 15న అర్ధాంతరంగా ఉద్యోగం నుండి తీసి వేయించారన్నారు. గ్రామ రాజకీయాలకు రాజకీయ వేధింపులకు చిరు ఉద్యోగులను బలి చేయడం దుర్మార్గం అన్నారు. మేము అధికారంలోకి వస్తే రాజకీయ వేధింపులు ఉండవని అందరి బ్రతుకులకు భరోసాగా ఉంటామని ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీకి ఇది విఘాతం కలిగించడమే అని వారు అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని బ్రతుకులను బజారుపాలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాజశేఖర్ ను విధుల నుండి తొలగించి ఇప్పటికే నెల రోజులు గడిచిందని ఎన్నో ఏళ్లుగా ఆ చిన్నపాటి ఉద్యోగం పై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆ కుటుంబం ఉన్నఫళంగా ఉపాధి కోల్పోతే ఎలా బ్రతకగలదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అధికారం ఇచ్చింది మంచి పరిపాలన అందించడానికే తప్ప తమ పంతాలు పట్టింపులు నెరవేర్చుకోవడానికి కాదన్న విషయాన్ని అధికార పార్టీ నాయకులు గ్రహించాలన్నారు. అధికారం శాశ్వతం కాదని గత ప్రభుత్వ అరాచక పాలనపై గత పాలకులకు ప్రజలు ఏ విధమైన స్థానం ఇచ్చారో పాలకులు ఎల్లప్పుడూ గమనంలో ఉంచుకోవాలన్నారు. రాజశేఖర్ విషయం పై ఇప్పటికే డోన్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి ని కలిసి వారి దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగిందని వారు సమస్యను సామరస్యంగా పరిష్కరించి ఆ కుటుంబానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని లేని యెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా యూనియన్ నాయకులు మధుసూదన్ గౌడ్, చాణక్యనాయుడు ,గోపాలకృష్ణ, వలి,ఆర్.కె.విరాజు,మహేష్ నాయుడు,శ్రావణ్,రాజు,రామిరెడ్డి, హరిప్రసాద్,మధు,భాస్కర్,మహేష్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం యత్నం

హైదరాబాద్, జూలై 16, తెలంగాణ నార్నర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్తు సంబంధ సమస్యలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్తు అంతరాయాలను తగ్గించడంతో పాటు అందుబాటులో ఉన్న సాంకేతికను అందిపుచ్చుకునేందుకు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో అస్సెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సంస్థ పరిధిలోని అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ పద్ధతితో విద్యుత్తు సంబంధ సమస్యలు తొందరగా పరిష్కరించేందుకు అవకాశం ఉండటంతో పాటు అంతరాయాలను అరికట్టే వీలుంటుందని సీఎండీ కర్నాటి వరుణ్ తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే ఎన్ పీడీసీఎల్ ఆఫీసర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ లో అస్సెట్ మ్యాపింగ్ వల్ల స్తంభాల వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టే అవకాశం ఉంటుందని సీఎండీ వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేగాకుండా మెయింటెనెన్స్ ను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్ చేసే వీలు ఉంటుందని తెలిపారు. అంతరాయాలు, ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్యాలు కూడా ట్రాక్ చేసుకునే సౌల్యభ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నెంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకునే ఆస్కారం ఉంటుందని, వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని వెల్లడించారు. దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, ముందస్తు సమాచారం తెలుసుకోవడానికి, సమస్యలు ఏర్పడక ముందే గుర్తించడానికి ఎంతో దోహద పడుతుందని సీఎండీ వివరించారు. కరెంట్ పోల్స్ కు యూనిట్ నెంబర్ కేటాయింపు ప్రక్రియ వేగంగా సాగుతోందని, ఇప్పటివరకు సుమారుగా 1,862 ఫీడర్లకు నెంబరింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని సీఎండీ వరుణ్ రెడ్డి తెలిపారు. వాటి డిజిటలైజేషన్ తో పాటు ప్రీ మాన్సూన్ ఇన్ స్పెక్షన్ కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగతా ఫీడర్లను రాబోయే రెండు నెలల సమయంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని సీఎండీ వివరించారు. ప్రీ మాన్సూన్ ఇన్ స్పెక్షన్ (పీఎంఐ) లో భాగంగా ముందస్తు విద్యుత్ లైన్ల నిర్వహణ కార్యక్రమం చేపట్టి, ఎప్పటికప్పుడు పీఎంఐ ఆప్ లో వివరాలు అప్ లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. పోల్ నెంబర్ పెయింటింగ్ ద్వారా అస్సెట్ మ్యాపింగ్ చేసిన అన్ని రకాల విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లను సమయానుసారంగ నిర్వహణ చేపట్టడంతో పాటు అప్ గ్రేడ్ చేసేందుకు కూడా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ తద్వారా సమస్యలను పరిష్కరించడం, అంతరాయాల సమయాన్ని తగ్గించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత సాకేంతికతకు అందుబాటులోకి తీసుకు వచ్చి విద్యుత్తు సంబంధ సమస్యలపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు.

## శాకాంబరీ అమ్మ వారికి వెయ్యి కేజీల కూరగాయలు వితరణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరీ అమ్మవారికి ఈనెల పౌర్ణమి రోజున జరిగే శాకాంబరీ ఉత్సవమునకు కావలసిన షుమారు 1 వెయ్యి కేజీల కూరగాయలను ఇచ్చుటకు ప్రముఖ వ్యాపారులు అయిన లక్కనబోయిన ప్రసాద్ ఆదిలక్ష్మమ్మ దంపతులు స్వచ్చందంగా ముందుకు వచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి గారి ఆదేశంతో మంగళవారం మార్కెట్ ప్రసాద్ ఇంటికి వచ్చిన ఆలయ ఏఈఓ,లు వేదపండితులు ప్రసాద్ గారిని కలిసి కావలసిన కూరగాయల వివరాలను తెలియజేశారు.

## ఓడూరు ఐపీసీ చర్చిలో యు పి ఎఫ్ సర్వసభ్య సమావేశం - నూతన కమిటీ ఎన్నిక

పెనుమంట్ర జులై 16 :పెనుమంట్ర మండలం యు.పి.ఎఫ్ సర్వసభ్య సమావేశం సోమవారం ఓడూరులో ఐపిసి చర్చ్ లో నిర్వహించారు. యుపిఎఫ్ సభ్యులందరూ ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో స్టీరింగ్ కమిటి చైర్మన్ గా రెవ డా పి .ఆశిష్ విక్టర్,అధ్యక్షులుగా రెవ. డావడ్డీ చిట్టి బాబు, ప్రెసిడెంట్ గా రెవ కె.డేవిడ్ రాజు, సెక్రెటరీగా బాలు ఎం ప్రదీప్ ,ట్రెజరర్ గా పాలపర్తి మోజెస్ ,వైస్ ప్రెసిడెంట్ గా ఎ థామస్, జాయింట్ సెక్రెటరీగా తానేటి యేసురత్నం, జాయింట్ ట్రెజరర్ గా బి. ఫ్రాన్సిస్ , స్త్రీల కమిటి సభ్యులుగా నేకూరి. విమల , నల్లి దయా మణి , కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# సింగిల్ డిజిట్ కే బిఆర్ఎస్ పరిమితం కానున్నదా?

హైదరాబాద్ జూలై 16, నేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లలోనాటి తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల ఎల్ పీలను విలీనం చేసుకున్న విధంగానే.. ఇప్పుడు బీఆర్ఎస్ వంతు వచ్చింది. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకోలేక.. అధికార పార్టీని ఏమీ చేయలేక... తాను తీసుకున్న గోతిలో తానే పడినట్లుగా గులాబీ పరిస్థితి మారింది. ఎంఎల్ఎల జంపింగ్ లతో గులాబీ పార్టీ త్వరలోనే సింగిల్ డిజిట్ కు పరిమిత పరిమితమయ్యే అవకాశముందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. దీంతో గులాబీ పార్టీ ప్రతిపక్ష స్థానాన్ని కోల్పోయి ప్రమాదం కళ్ల కు కట్టినట్లుగా కనిపిస్తోంది. ఇదే జరిగితే కేసీఆర్ భారీ మూల్యం చెల్లించుకున్నట్లే అవుతుందన్న వాదన రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో అసలు ప్రతిపక్షం అంటూ లేకుంటా చేయాలన్న కేసీఆర్ ఆలోచనే..... ప్రస్తుతం గులాబీ పార్టీకి శాపంగా మారిందని తెలుస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ పెట్టిన ఇబ్బందులకు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వడ్డీతో సహ చెల్లించాలన్న కృత నిశ్చయంతో ఉంది. ఇందులోభాగంగానే గులాబీ పార్టీ కి చెందిన శాసనసభ, శాసనమండలి సభ్యులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ లో చేర్చు కుంటున్నారు. ఇప్పటికే పది మంది. శాసనసభ్యులను, ఆరుగురు ఎంఎల్ సీలను అధికార పార్టీ చేర్చుకుంది. మిగిలిన వారు కూడా అదే దారిలో ఉన్నారు. త్వరలోనే వారంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయినప్పటికీ గులాబీ బాస్ కేసీఆర్ వారిని కాపాడుకోలేక ......చేజారిపోతున్నా వారిని నిలువరించలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నారని తెలుస్తోందిబీజేపీ.. ప్రతిపక్ష హోదాలోకి రాబోతుందనే చర్చ ...అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెలాఖరు నాటికి వీఆర్ఎస్ లెక్కలు పూర్తిగా తారుమారు కానున్నాయని తెలుస్తోంది. రాష్ట్రంలో అతి పెద్ద ఉద్యమపార్టీగా ఆవిర్భవించిన గులాబీ పార్టీ ఇక మూడో స్థానానికి పడిపోతుందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఇకచరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కారు

### తప్పతడుగులకు భారీ మూల్యం చెల్లించుకోనున్నకేసీఆర్

పార్టీ.. గతలోక్సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసినప్పటికీ 39 సీట్లను గెలుచుకున్న గులాబీ పార్టీ కేవలం మూడు నెలల వ్యవధిలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా దిగజారింది. కారు పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోగా.... సుమారు పది నియోజకవర్గంలో ఆ పార్టీ డిపాజిట్లను సైతం కోల్పోయింది. ఇక పదిహేను లోక్ సభ సెగ్మెంట్లలో గులాబీ పార్టీ అభ్యర్ధులు మూడవ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామంలతో పార్టీ భవిష్యత్తుపై నేతల్లో ఆందోళన నెలకొంది. ఇందులో భాగంగానే గులాబీ నేతలంతా ఒక్కొక్కరుగా చేజారుతున్నారు. అయినప్పటికీ కేసీఆర్ కాపాడుకోలేకపోతున్నారు. పార్టీని వీడనున్నారని ప్రచారం సాగుతున్న నేతలను పిలుపించుకుని కేసీఆర్ చర్చలు జరుపుతున్నప్పటికీ...ఆ మార్నాడే సదరు నేతలు పార్టీని వీడుతున్నారు. ఈ ఘటనలు చూసి కేసీఆర్ అసహనంతో రగిలిపోతున్నారు. అంతర్గతంగా కుమిలిపోతున్నారు. అయినప్పటికీ ఆయనఫామ్ హౌస్ దాటలేక పోతున్నారంటూ ఆయనపై సొంతపార్టీ నేతలే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పతనం గురించి కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్నా.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు అండ్ కో నోరు విప్పిన పాపాన పోలేదు. ఓటమి తర్వాత కుంగిపోయి.. కుమిలిపోతున్నారే తప్ప.. నేతలను కాపాడుకునే ప్రయత్నాలు చేయటం లేదనే టాక్ నడుస్తోంది. కాంగ్రెస్ కంటే కేవలం 1.8 శాతం ఓట్లు మాత్రమే తక్కువగా వచ్చాయని.. కేసీఆర్, కేటీఆర్, హరీష్రావు అనేక సార్లు కామెంట్ చేశారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని చెప్పుకుంటూ వచ్చారు. అదే సమయంలో రేవంత్ సర్కార్ పై కేటీఆర్, హరీశ్ రావులు విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ కేసీఆర్ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఇది కూడా గులాబీ నేతలకు అంతగా రుచించడం లేదు. దీని కారణంగా పార్టీ మారాలని భావిస్తున్న గులాబీ నేతలకు వారినిమరింత స్వేచ్ఛ వచ్చిందనే వాదనలూ ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రహించి వారితో రహస్య మంతనాలతో పాటు బుజ్జగింపులు చేస్తున్నా.. పార్టీలో కొనసాగేందుకు నేతలు ఆసక్తి చూపటం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఫలితంగా కడియం శ్రీహరితో మొదలైన వలసలు.. తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, తాజాగాగూడెం మహిపాల్ రెడ్డి చేరిక దాకా చేరింది. మరికొందరు నేతలు కూడా హస్తం గూటికి చేరతారనే ప్రచారం సాగుతోంది. దీంతో ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల నాటికి బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్లో విలీనం దిశగా పరిణామాలు మారుతున్నాయి. ఇటీవల జరుగుతున్న ఘటనలే దీనికి నిదర్శంగాకనిపిస్తోంది. ప్రతిపక్ష హె?దాపై బీజేపీ కన్ను..రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా పై బీజేపీ కన్నువేసినట్లుగా తెలుస్తోంది. ఈ నెలాఖరు కల్లా బీజేపీ కనీసంగా 12సీట్లతో ప్రధానప్రతిపక్షంగా

# తిరుమల ప్రక్షాళన అయ్యేనా

తిరుమల, జూలై 16,తిరుమల.. కలియుగ వైకుంఠం. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచమంతా భక్తులున్న దివ్యక్షేత్రం. శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. అందుకే ఆ కలియుగ దైవం దర్శనం కోసం .. ఎక్కడెక్కడి నుంచో సామాన్య భక్తులు వ్యవయప్రయాసలకు ఓర్చి ఏడు కొండలెక్కి వసతులున్నా లేకున్నా రోడ్లపై పడిగాపులు కాస్తారు. కంపార్ట్‌మెంట్లలో గంటలకు గంటలు ఎదురు చూస్తారు. కిక్కిరిసిన క్యూలైన్లలో తోసుకుంటూ.. ఆనందనిలయం ముందు దివ్యదర్శనానికి అడుగుపెడతారు. అరసెకనులో గర్భగుడి బయట క్యూలైన్లలో ఉన్న సామాన్య భక్తులను సిబ్బంది లాగి అవతల పడేస్తుంటే.. అరసెకను ఆ వేంకటేశ్వరుడి దివ్య దర్శనం చేసుకుని అరమోడ్పు కన్నులతో ఆలయం బయటకు చేరతారు. ఇది తిరుమల క్షేత్ర దర్శనం అనగానే మనకు గుర్తుకొచ్చేవి.తిరుపతిలో అడుగు పెట్టింది మొదలు.. మళ్లీ తిరుమలలో దర్శనం ముగించుకుని కొండ దిగే వరకు సామాన్య భక్తులకు ఎన్నో అవస్థలు.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలక మండళ్లు మారుతున్నా నిత్యం భక్తుడికి ఆ వెంకన్న దర్శనం అంటే కేవలం దైవదర్శనం మాత్రమే కాదు. సమస్యలను ముందు దర్శించి వాటిని అధిగమించి ఆ తర్వాతగానీ శ్రీనివాసుడిని దర్శించుకోవడం సాధ్యం కాదు.భార్యాభర్తలు, పిల్లపాపలు, వృద్ధులు ఇలా కుటుంబాలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తుంటారు సామాన్య భక్తులు. కొండపైకి రాగానే వాళ్లకు ముందు వసతి పెద్ద సమస్యగా మారుతుంటుంది. కాటేజీలున్నా.. భక్తుల రద్దీకి తగినంత ఉండవు. రోజురోజుకీ తిరుమలకు వచ్చే భక్తులు పెరుగుతూనే ఉన్నారు. కానీ.. కొండపై ఆ రద్దీని తట్టుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడం పెను సవాలే. వీఐపీ భక్తులకు ప్రత్యేకమైన కాటేజ్‌లు, వసతులున్నాయి. బ్రేక్ , స్పెషల్ పేరుతో రెండు మూడు గంటల్లోనే వెంకన్న దర్శనం పూర్తవుతుంది. సామాన్య భక్తులకు వసతి సముదాయాలు అంతంత మాత్రమే. కొండపై వీఐపీలకే ప్రాధాన్యమిస్తున్నారని వారి సేవలోనే టీటీడీ తరిస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నా టీటీడీ మాత్రం ఉన్న కాటేజీలతోనే సర్దుబాటు చేస్తోందని.. సామాన్య భక్తులకు కొత్త కాటేజీలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.వారాంతాలు, పర్వదినాలు, సెలవులు, బ్రహ్మోత్సవాలు.. ఇలాంటి సమయాల్లో తిరుమలకు రద్దీ విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. అప్పుడు భక్తులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు తమ ఇలవేల్పు, నమ్మిన దైవమైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలి. అంతకు ముందు కొండపై క్యూలైన్లలో సమస్యలతో సావాసం చేసి ముందుకు సాగాలి. రద్దీ సమయాల్లో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోతాయి. వెలుపలకు కిలోమీటర్ల క్యూలైన్లు కనిపిస్తాయి. చిన్నపిల్లలతో వచ్చినవాళ్లు, వృద్ధులు ఆ క్యూలైన్లు, కంపార్టమెంట్లలో ముందుకు నడవడమంటే కత్తిమీద సామే. అలాంటి వారికి ప్రత్యేక వసతులు కల్పించి వీలైనంత త్వరగా దర్శనం పూర్తి చేయించాల్సిన అవసరముందనేది భక్తుల నుంచి వస్తున్న విన్నపం.కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం గంటల తరబడి వేచి చూడాలి. అక్కడ పలు ప్రాంతాలకు చెందిన భక్తులుంటారు. పెరుగన్నం, పులిహోర, సాంబార్ రైస్ ఇలా ప్రసాదాలను కంపార్టమెంట్లలో భక్తుల ఆకలి తీర్చేందుకు టీటీడీ అందిస్తుంటుంది. వీటి నాణ్యత విషయంలో భక్తుల నుంచి రకరకాల కంప్లైంట్స్ అందుతున్నాయి. నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం క్వాలిటీపైనా రకరకాల విమర్శలున్నాయి. దర్శనానంతరం శ్రీవారి దివ్యప్రసాదంగా లడ్డూను భక్తులకు అందిస్తారు. వీటి తయారీ, నాణ్యత, లడ్డూ సైజ్‌పై కూడా ఫిర్యాదులు ఈమధ్యకాలంలో పెరిగాయి. ఒకప్పుడు లడ్డూ వారం రోజులు నిల్వ ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చేది కాదు. కానీ.. అందులో వాడే సరుకుల క్వాలిటీలోపం కారణంగా రెండ్రోజులకే లడ్డూ ప్రసాదం చెడుపోతోందన్న కంప్లైంట్స్ వ్యక్తమవుతున్నాయి. వీటిపైనా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలనేది భక్తుల ఆవేదన.ప్రక్షాళన తిరుమల నుంచే మొదలు పెడతామని ఏపీ సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కొండకు వచ్చిన సందర్భంగా స్పష్టం చేశారు. భక్తులు ఎదుర్కొనే సమస్యలు ఒకవైపు ఉంటే.. గత పాలకమండలిపై విమర్శలు, అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ముందుగా టీటీడీ పాలకమండలి ఈవోను మార్చి కొత్త ఈవోగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఏయే వ్యవస్థల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసేందుకు స్టేట్‌లెవల్ విజిలెన్స్ కమిటీ రంగంలోకి దిగింది.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపి నాగరాజు

విజయవాడ,విజయవాడలోని కనక దుర్గమ్మ అమ్మవారిని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు.. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎం.పి కి ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు...కనకదుర్గమ్మ ను దర్శించుకున్న ఆయన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. దర్శనం అనంతరం వేదపండితులు ఎం.పి నాగరాజుకు వేదాశీర్వచనాలను అందించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను, షెనవస్త్రాలను , చిత్రపట్టాన్ని అందచేశారు.. ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారిని దర్శించికోవడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు.. అమ్మవారి ఆశిశులు రాష్ట్ర ప్రజల పై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకునట్లు ఆయన తెలిపారు..

# ఆ నలుగురు ఇప్పుడెటూ...

విజయవాడ, జూలై 16 ఏపీలో రాజకీయాలకు, సినిమా రంగానికి దగ్గర సంబంధం ఉంటుంది. 1983లో టిడిపి ఆవిర్భావంతో.. తెలుగు సినీ పరిశ్రమ సైతం రాజకీయాల వైపు మళ్ళింది. ప్రతి ఎన్నికల్లోను సినీ పరిశ్రమ ప్రభావం చూపింది. కొందరు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారు. మరికొందరు పార్టీలకు తమ మద్దతు ప్రకటించారు. ప్రచారం కూడా చేశారు. రాజ్యసభ, ఇతర నామినేటెడ్ పోస్టులు దక్కించుకున్న వారు ఉన్నారు. అయితేసినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు రాజకీయ విమర్శలకు దూరంగా ఉండేవారు. తాము ఉండే పార్టీకి ప్రచారం చేసుకునేవారు కానీ.. ప్రత్యర్థి పార్టీలపై హద్దులు దాటి విమర్శలు చేయలేదు. అయితే గత ఐదేళ్ల వైసిపి హయాంలో .. చాలామంది నటులు రాజకీయ విమర్శలు చేశారు. వారి పరిస్థితి ఇప్పుడు ఏంటి? అన్నది ప్రశ్నార్థక ంగా మారింది.సినీ రంగం నుంచి రోజా అనూహ్యంగా రాజకీయా ల్లోకి వచ్చారు. సుదీర్ఘకాలం టిడిపిలో కొనసాగారు. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేశారు. 2014 ఎన్నికల్లో నగిరి నుంచి పోటీ చేసి గెలిచారు. 2019 ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకున్నారు. అయితే ఆమె మెగా కుటుంబాన్ని నిత్యం టార్గెట్ చేసేవారు. అయితే ఆమెకు సినీ పరిశ్రమలో అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ఈటీవీలో వచ్చే జబర్దస్త్ లో జడ్జిగా వ్యవహరించేవారు. ప్రత్యేక కార్యక్రమాల్లో కనిపించేవారు. కానీ మంత్రి అయ్యాక టీవీ షో నుంచి కూడా తప్పుకున్నారు. ప్రస్తుతం ఆమె చేతుల్లో సినిమాలు లేవు. టీవీ షోలు కూడా అవకాశం దక్కే ఛాన్స్ కనిపించడం లేదు.వైయస్ కుటుంబానికి వీర విధేయుడు పోసాని కృష్ణ మురళి. చంద్రబాబుకు బద్ధ వ్యతిరేకి. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంతో చిరంజీవితో కూడా కలిసి పని చేశారు. కానీ తర్వాత జగన్ పార్టీ పెట్టడంతో అటువైపు మొగ్గు చూపారు. మెగా కుటుంబం పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. చంద్రబాబు పై సైతం విపరీత కామెంట్స్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం కావడం, పవన్ డిప్యూటీ సీఎంగా ఉండడంతో.. పోసానికి తప్పకుండా సినిమాలు తగ్గుతాయని తెలుస్తోంది. అనవసరంగా వివాదాలు కొని తీర్చుకోవడం ఏంటని నిర్మాతలు పోసానికి ఛాన్స్ ఇచ్చే పరిస్థితి ఉ ండదని తెలుస్తోంది.వైసీపీకి సపోర్ట్ చేశారు కమెడియన్ అలీ. కానీ ఎన్నడూ రాజకీయ విమర్శలు చేసే వారు కాదు. ప్రత్యర్థులను టార్గెట్ చేసిన సందర్భాలు కూడా లేవు. కేవలం వైసీపీ కోసం మాట్లాడేవారు. ఈ ఎన్నికల్లో ప్రచారానికి కూడా దూరంగా ఉన్నారు. వైసిపి ఓడిపోవడంతో.. ఇక తాను రాజకీయా లనుంచి తప్పుకుంటానని.. ఏ రాజకీయ పార్టీతో తనకు సంబంధం లేదని ప్రత్యేక ప్రకటన ఇచ్చారు. సో ఆలీ కి కొంత ఇబ్బందులు ఉండవని తెలుస్తోంది. ఆయన చేతిలో సినిమాలతో పాటు టీవీ షో కూడా ఉంది. 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి గతంలో వైసిపికి పనిచేశారు. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం కూటమి వైపు నిలిచారు. కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. సో ఆయనకు వచ్చిన ఇబ్బందులు ఏంటి లేవు.బుల్లితెర నటులు ఈసారి క్రియాశీలక పాత్ర పోషించారు. జనసేన తో పాటు కూటమికి ప్రచారం చేశారు. హైపర్ ఆది, కిరాక్ ఆర్పి తదితరులు శ్రమించారు. కిరాక్ ఆర్పి అయితే రాజకీయ విమర్శలు ఎక్కుపెట్టేవారు. ఆయన చేసిన కామెంట్స్ విపరీతంగా వైరల్ అయ్యేవి. ఇప్పుడు కూటమి గెలిచిన తర్వాత కూడా కిరాక్ ఆర్ పి ఓ రేంజ్ లో విమర్శలకు దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన బుల్లితెర ప్లాట్ఫామ్ పైలేరు. వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆయన విమర్శల వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మరోవైపు యాంకర్ శ్యామల మాత్రం అడ్డంగా బుక్కయ్యారు. పిఠాపురంలో పవన్ ఓడిపోతున్నారని, ఏవేవో కథలు కూడా అల్లుతూ వైసిపి అనుకూల మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆమె కెరీర్ కు తప్పకుండా ఇబ్బందికర పరిస్థితులు ఎదురు కావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి అయితే పవన్ డిప్యూటీ సీఎం కావడంతో సినీ పరిశ్రమ సంతోషంతో ఉంది. కానీ ఆ నలుగురు మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవడం ఖాయంగా తెలుస్తోంది.

# శాంతి ఎపిసోడ్ వెనుక సొంత పార్టీ నేతలు

విశాఖపట్టణం, జూలై 16విజయసాయిరెడ్డి ప్రతిష్టను సొంత పార్టీ నేతలు డ్యామేజ్ చేస్తున్నారా? మానసికంగా దెబ్బతీయాలని చూస్తున్నారా? ఇబ్బంది పెట్టాలని భావిస్తున్నారా? ఆయనపై తాజా ఆరోపణల వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. విజయసాయిరెడ్డి తాజా వ్యాఖ్యలు చూస్తుంటే ఇదే అర్థమవుతోంది. ఓ మహిళా అధికారిపై ఆయన భర్త చేసినఆరోపణల నేపథ్యంలో.. విజయసాయిరెడ్డి ప్రస్తావన రావడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయింది. మీడియాలో సైతం విస్తృత చర్చకు కారణమైంది. దీనిపై విజయసాయిరెడ్డి స్పందించారు. స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు.వైసీపీలో నెంబర్ 2గా ఏదిగారు విజయసాయిరెడ్డి. ఆ స్థానానికిచాలా పెద్ద పోటీ ఉంది. వైసిపి ఆవిర్భావ సమయంలో నెంబర్ 2 గా ఉ మ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఉండేవారు. తెలంగాణకు చెందిన గోనె ప్రకాష్ రావు, కొండా సురేఖ సైతం జగన్ ను అనుసరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు వైసీపీలో నెంబర్ 2 స్థానం మారిపోతూ వచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన నాటికి విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి మధ్య విపరీతమైన పోటీ ఉండేది. ముఖ్యంగా విజయసాయిరెడ్డి ప్రాధాన్యతను తగ్గించి.. ఆ స్థానానికి వచ్చారు సజ్జల రామకృష్ణారెడ్డి. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎనలేని ప్రాధాన్యత దక్కించుకున్నారు. జగన్ సైతం సకల శాఖలను ఆయనకే అప్పగించారు. చివరకు విజయసాయిరెడ్డిని ఉత్తరాంధ్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారు. ఆ పదవిని తన బాబాయి వైవి సుబ్బారెడ్డి కి అప్పగించారు. సోషల్ మీడియా విభాగం నుంచి సైతం తప్పించారు. ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవ రెడ్డికి అప్పగించారు. అయితే పార్టీలో జరిగిన ఈ పరిణామాలతో కొద్దిరోజుల పాటు విజయసాయిరెడ్డి సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం తగ్గించారు.నందమూరి తారకరత్న మరణంతో చంద్రబాబు, బాలకృష్ణ లను విజయసాయిరెడ్డి కలవాల్సి వచ్చింది. విజయసాయిరెడ్డి మరదలు కుమార్తె అలేఖ్య రెడ్డి తారకరత్న భార్య. తారకరత్న మరణంతో వారికి అండగా నిలవాల్సిన పరిస్థితి విజయసాయి రెడ్డి పై ఏర్పడింది. తారకరత్న నందమూరి కుటుంబ సభ్యుడు కావడంతో చంద్రబాబుతో పాటు బాలకృష్ణ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో చంద్రబాబుతో పాటు బాలకృష్ణతో సన్నిహితంగా గడిపారు విజయసాయిరెడ్డి. దీంతో అప్పట్లో ఒక ప్రచారం బలంగా జరిగింది. వైసిపి శ్రేణులు సైతం విజయ సాయి రెడ్డిని అనుమానంగా చూశాయి. కానీ క్రమేపి ఆ అనుమానాలు తగ్గాయి. తిరిగి విజయసాయిరెడ్డి యాక్టివ్ అయ్యారు. నెల్లూరులో వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి టిడిపిలోకి వెళ్లిపోవడంతో.. జగన్ విజయసాయిరెడ్డి ని ఆశ్రయించాల్సి వచ్చింది. నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేయాల్సి వచ్చింది. అక్కడ ఓటమి గ్యారెంటీ అని తెలిసినా తనను ప్రయోగించడం పై విజయసాయిరెడ్డి కూడా బాధపడినట్లు తెలుస్తోంది. అందుకే ఓటమి తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం.అయితే తాజాగా ఓ మహిళ అధికారి గర్భం విషయంలో తన పేరు బయటకు రావడానికి విజయసాయిరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. రాజకీయ ప్రత్యర్థులతోపాటు తనతో గిట్టని సొంత పార్టీ వారిపై సైతం అనుమానం వ్యక్తం చేశారు. సొంత పార్టీ వారే టిడిపితో కుమ్మక్కై ఈ కుట్రకు తెర లేపారని ఆయన మీడియా ముందు ఓపెన్ కావడం గమనార్హం. సదరు మహిళా అధికారి వైసిపి నాయకుల సిఫారసులకు పెద్దపీట వేస్తారన్న విమర్శలు ఉన్నాయి. వైసిపి హయాంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వైసిపి పెద్దలతో ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పని గట్టుకొని విజయసాయి రెడ్డి పై ఆరోపణలు రావడం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. విజయసాయిరెడ్డి సైతం ఇదే తరహా అనుమానాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. మున్ముందు ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో చూడాలి.

# జగన్ ఓవర్ టూ బెంగళూరు...



విజయవాడ, జూలై 16,జగన్ ఇటీవల తరచూ బెంగళూరు వెళుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒకసారి వెళ్లారు. వారం రోజులపాటు అక్కడే ఉన్నారు. ఇప్పుడు మరోసారి వెళ్తున్నారు. వారం రోజులు పాటు అక్కడే గడపనున్నారు. ఈసారి వైద్య సేవల కోసమే ఆయన బెంగళూరు వెళు తున్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. అయితే షర్మిల రూపంలో కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శల డోర్స్ పెరగడంతోనే ఆయన బెంగుళూరు వెళు తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ద్వారా షర్మిలను కట్టడి చేసేందుకే నన్న టాక్ నడుస్తోంది. అయితే అందులో ఎంత నిజం ఉందో తెలియాలి.జగన్ కు పులివెందులతో పాటు బెంగళూరు, హైదరాబాదులో ప్యాలెస్ లు ఉన్నాయి. అందులో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సమకూర్చుకున్నవి కూడా ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాదులోని లోటస్ ఫండ్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించినదే. వైసిపి ఆవిర్భావం కూడా అక్కడి నుంచే ప్రారంభమైంది. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను అక్కడి నుంచే నిర్వర్తించారు జగన్. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్యాలెస్ కు పరిమితం అయ్యారు. అయితే అప్పటినుంచి లోటస్ ఫండ్ ఖాళీగా ఉంది. షర్మిల ఏపీ నుంచి తెలంగాణ వెళ్లి రాజకీయాలు చేశారు. వైయస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించారు. అయితే ఆమె సైతం లోటస్ ఫండ్ నుంచే తన కార్యకలాపాలను మొదలుపెట్టారు. అంటే అది ఉమ్మడి ఆస్తి కనుక.. అందులో తనకు కూడా వాటా ఉందని షర్మిల కోరినట్లు తెలుస్తోంది. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించింది కనుక.. జగన్ సైతం షర్మిల అందులో ఉండేందుకు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.కేవలం ఆస్తి వివాదాల వల్లే సోదరుడు, సోదరి మధ్య విభేదాలు వచ్చాయి. రాజకీయంగా విభేదించేంతవరకు పరిస్థితి వచ్చింది. ఈ కాంగ్రెస్ పార్టీని ద్వేషించారో అదే పార్టీలోకి షర్మిల వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు అదే షర్మిల ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకొని జగన్ పై పోరాడుతున్నారు. గట్టిగానే ఫైట్ చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ లోటస్ ఫండ్ తన ఆధీనంలో ఉంచుకున్నారు. అందుకే జగన్ హైదరాబాద్ వెళ్లడం లేదని తెలుస్తోంది. కేవలం షర్మిల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఒక టాక్ అయితే మాత్రం నడుస్తోంది.బెంగళూరులో విలాసవంతమైన ప్యాలెస్ జగన్ కు ఉంది. రాజకీయాల్లో యాక్టివ్ కాకమునుపే జగన్ బెంగళూరు కేంద్రంగా వ్యాపారాలు చేసేవారు. రాజశేఖర్ రెడ్డి సీఎం అయిన తరువాత వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. అయితే బెంగళూరులో ముచ్చటపడి యలహంక ప్రాంతంలో ఒక ప్యాలెస్ ను కట్టుకున్నారు. అదే ప్యాలెస్ లోకి ఇప్పుడు వెళుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత భార్యతో కలిసి పులివెందుల వెళ్లారు. అక్కడ నుంచి బెంగళూరు చేరుకున్నారు. ఐదు రోజులపాటు అక్కడే గడిపారు. సీఎంగా ఉన్నప్పుడే కాలికి గాయంతో బాధపడ్డారు జగన్. ఇప్పుడు వైద్యం చేసుకునేందుకు మరోసారి బెంగళూరు వెళ్తున్నారు.అయితే బెంగళూరు పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని వైసీపీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. హైదరాబాదులోని లోటస్ ఫండ్ షర్మిల ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్ సైతం హైదరాబాద్ వెళ్లకుండా.. బెంగళూరులో తన సొంత ఇల్లు ఉండడం కారణంగా అక్కడికి వెళుతున్నట్లు సమాచారం. అయితే కేవలం రాజకీయ కోణంలో చూసి.. కాంగ్రెస్ పార్టీతో మంతనాలు సాగించేందుకే తరచూ జగన్ బెంగళూరు వెళ్తున్నట్లు టాక్ నడిచింది. తనను జగన్ కలిశారన్న ప్రచారానికి చెక్ చెప్పారు డీకే శివకుమార్. దానిలో ఎలాంటి నిజం లేదని కూడా తేల్చి చెప్పారు. ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం, ట్రబుల్ షూటర్ గా ఉన్న డీకే శివకుమార్ ఈ తరహా ప్రకటన చేశారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జగన్ బెంగళూరు వెళుతుంది కేవలం షర్మిల హైదరాబాద్ లోని లోటస్ ఫండ్ స్వాధీనం చేసుకోవడమే కారణమని తెలుస్తోంది. అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి

# ముచ్చుమర్రి బాలిక కుటుంబానికి 10 లక్షల సాయం

కర్నూలు, జూలూ 16 నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో సామూహిక అత్యాచారానికి గురైన బాలిక మృతదేహం ఇంకా లభ్యంకాలేదు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలతో వారం రోజుల నుంచి వెతికినా చిన్నారి మృతదేహం దొరకలేదని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముచ్చుమర్రి బాధిత బాలిక కుటుంబానికి ఏపీ ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించింది. బాధిత బాలిక కుటుంబానికి ఏపీ ప్రభుత్వం నుంచి రూ. 10 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. విజయనగరంలో జరిగిన దారుణ ఘటనపై సైతం మంత్రి అనిత స్పందించారు. విజయనగరంలో ఊయలలో ఉన్న ఆరు నెలల పసికందుపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. తాగిన మైకంలో ఓ వృద్ధుడు నెలల పాపపై అత్యాచారం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనలపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్షించారు. లిక్కర్, డ్రగ్స్ మీద ఉక్కుపాదం మోపాలని సీఎం చెప్పారని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగితే నిందితుల్ని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని వదిలే ప్రసక్తే లేదని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. ముచ్చుమర్రి ఘటన, 6 నెలల చిన్నారిపై అత్యాచారం ఘటనలపై స్పెషల్ కోర్టు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ముచ్చుమర్రి బాధిత బాలిక కుటుంబానికి 10 లక్షలు ఆర్థిక సాయం, విజయనగరంలో ఆరు నెలల చిన్నారి కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. అడపిల్లల్ని తప్పుగా చూసే వారికి, వారిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం, క్రిమినల్ ఏ పార్టీ వాళ్లు అయినా ఊరుకునేది లేదన్నారు. వారం రోజుల కిందట నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో 14 నుంచి 16 ఏళ్ల బాలురు ముగ్గురు ఎనిమిదేళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేశారు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాల గ్రామంలో ఈ దారుణం జరిగింది. వారం దాటినా బాలిక మృతదేహం లభ్యం దొరకకపోవడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని స్థానికులు చెబుతున్నారు.

# టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డే ఆక్రమించాడు

## మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

అమరావతి జూలై 16 గత ఐదేళ్లలో వైసిపి నేతలు భారీ భూదోపిడీకి పాల్పడ్డారని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో భూదోపిడీలో వైసిపి మంత్రులు, ఎంఎల్ఏలు కీలక పాత్ర పోషించారని, వైసిపి మాజీ ఎంఎల్ఏలు పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి చిత్తూరు జిల్లాల్లోనే మూడ వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపణలు చేశారు. టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డి కుటుంబం వదల్లేదని, చట్టపరంగా విచారణ జరిపి త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామన స్పష్టం చేశారు. ఇప్పటికే రెవెన్యూ, దేవాదాయ అధికారులు విచారణ ముమ్మరం చేశారని, ఎపిలో ఉన్న గ్రానైట్ కొండలన్నీ పెద్దిరెడ్డే హస్తగతం చేసుకున్నారని, తమ భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదు చేసే కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు. భూములు, ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడిన వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. మైనింగ్ శాఖలో అవినీతిపై ఇప్పటికే విచారణ జరుగుతోందన్నారు.ఆర్‌టిసి నుంచి ఎలక్ట్రిక బస్సులు నడిపేందుకు సంస్థలతో చర్చిస్తున్నామని, గత ఐదేళ్లలో ఆర్‌టిసిని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని రామ్ ప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాగానే 200 వరకు కొత్త బస్సులు రోడ్డెక్కాయని, మరో 1200 కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయని వివరించారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి మార్గాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పనా అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్ లోని ఉపాధి కల్పన, స్వయం ఉపాధి మార్గాలపై జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఆసక్తిగల రంగాలలో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గాలను అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి రంగాలలో ఉన్న అవకాశాలను గుర్తించి నియోజకవర్గాల వారీగా యూనిట్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే సమావేశానికి తీసుకురావాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఏమి చేయగలమో అన్వేషించాలన్నారు. అగరబత్తుల తయారీ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, పికిల్ ఇండస్ట్రీస్, మిల్లెట్ బిస్కెట్ల తయారీ తదితర ఉపాధి రంగాల యూనిట్ల స్థాపనకు అవసరమైన వనరులను గుర్తించి నూతన ప్రాజెక్టులతో ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముమ్మరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డోన్ లో ఉన్న మోడల్ కెరీర్ సెంటర్ ను నంద్యాల జిల్లా కేంద్రానికి తీసుకొచ్చేందుకు సరైన కారణాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను పటిష్టం చేసి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా జాబ్ మేళాలు నిర్వహించి శిక్షణ ఇచ్చిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

# నిరుపేద కాలేజీ విద్యార్థినికి సైకిల్ పంపిణీ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-నంద్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై నిరుపేద బాలికకు కాలేజీకి వెళ్లడానికి అవసరమైన 6000 రూపాయలు విలువైన సైకిల్ ను విరాళంగా అందజేశారు. నంద్యాల పట్టణం మిషన్ కాంపౌండ్ ప్రాంతానికి చెందిన నిరుపేద అభిషేకమ్మ కూతురు మాధురి పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలై ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ కోసం చేరింది. రోజు కళాశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సమయంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి మారుతి కుమార్ దృష్టికి తీసుకురాగా ఆయన సహకారంతో ఫిరోజ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ పార్ట్నర్స్ సుధా మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, సెవెన్ హిల్స్ హాస్పిటల్ సిబ్బంది ప్రేమ్ కుమార్, మురళి, రాజశేఖర్, టిడిపి నాయకులు వైయస్ ఆర్ నగర్ దారెడ్డి శివ నాగిరెడ్డి. బుగ్గ రాములు. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాగే సెవెన్ హిల్స్ హాస్పిటల్ మారుతి కుమార్ కూడా చాలా సేవా కార్యక్రమాలకు సహకారం చేస్తున్నారని, భవిష్యత్తులో వీరి సహకారంతో పట్టణంలోని వైద్యులు స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో అందరి భాగస్వామ్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నంద్యాల పట్టణంలోని నిరుపేద ప్రాంతాలకు చెందిన ప్రజలకు అందేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మారుతికుమార్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా రెడ్ క్రాస్ తరఫున తన వంతు సహాయ సహకారాలు కచ్చితంగా అందజేస్తానని ఫిరోజ్ తెలియజేసిన విధంగా నిరుపేద ప్రజల కోసం వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు.

# ప్రజలకు సేవకులం మాత్రమే పాలకులం కాదు: ఎన్ ఎమ్ డి ఫిరోజ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-ప్రజలకు మనము సేవకులం మాత్రమేనని పాలకులం కాదని ఎన్ ఎమ్ డి ఫిరోజ్ పేర్కొన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ నంద్యాల కార్యాలయంలో టీడీపీ వార్డు ఇంచార్జ్ ల అండ్ నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎన్ ఎమ్ డి ఫిరోజ్ పాల్గొని దిశనిర్దేశం చేశారు. మనము ప్రజలకు సేవకులం పాలకులం కాదన్నారు. ఫిరోజ్ మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల్లో ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త వార్డు నాయకులు,కార్యకర్తల కష్టం వాళ్లే తెలుగుదేశం పార్టీ నంద్యాలలో ఘనవిజయం సాధించిందన్నారు. టీడీపీ పార్టీ గెలుపు కోసం నంద్యాల పట్టణంలోని 42 వార్డుల నుండి కృషి చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ విజయంతో మనందరి పై ఏంతో బాధ్యత పెరిగిందన్నారు.ప్రతి ఒక్క వార్డు ఇంచార్జ్ అనవసర హంగు అర్భాటులకు పోకుండా ప్రజా సమస్యలను శ్రద్ధగా విని ఆ సమస్యలను కాలయాపన చెయ్యకుండా పరిష్కరించి ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ప్రతి యొక్క వార్డు ఇంచార్జ్ తమ వార్డులోనున్న మురికికాలువల నిర్వహణ, త్రాగునీరు సరఫరా, కరెంటు సమస్యలు, సచివాలయాల నిర్వహణ, సంక్షేమ పథకాల కార్యాచరణ,వార్డుల్లో పెండింగ్ పనుల అవగాహన, డ్రైనేజీ / చెత్త నిర్మూలన తదితర అంశాల పై వీధిగా తరుచూ సమీక్షించి వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. నంద్యాల ఎన్నికల్లో అందరం సమిష్టిగా ఎలా పని చేసామో, ఈ ఐదేళ్ళు కూడ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నాయకుడిగా కాకుండా ఒక సాధారణ కార్యకర్తగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యలను వింటూ పరిష్కారం చేస్తానని ఫిరోజ్ హామీనిచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క నాయకుడికి కార్యకర్తలకు అండగా ఉంటానని మీరందరూ బాధ్యతతో ప్రజల కోసం పని చెయ్యాలని 20 ఏళ్ళ పాటు టీడీపీ జెండాను నంద్యాలలో ఎగిరేలా మనమందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు దూదేకుల జైనబీ , శ్రీదేవి , ఖండే శ్యామ్ సుందర్ లాల్. వైయస్ ఆర్ నగర్ టిడిపి నాయకులు దారెడ్డి శివ నాగిరెడ్డి 42 వార్డు ఇంచార్జ్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక మిస్సింగ్ మిస్టరీ కేసులో ముగ్గురు బాలురులను ఇద్దరు వ్యక్తులను అరెస్టు : జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-కేసు వివరాలు: 07.07.2024 నాడు నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామం నుండి ఒక 9 సం. ల బాలిక ఆడుకోవటానికి పార్కు కు వెళ్ళి తిరిగి ఇంటికి రానందున ఆమె తండ్రి సంగెం చిన్న మద్దిలేటి, పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ ఇచ్చారు.దానిపై అదే రోజు మిస్సింగ్ కేసు నమోదు చేయడమైనది.అప్పటినుండి మైనర్ బాలిక ఆచూకీ కనిపెట్టుట కొరకు నంద్యాల జిల్లా ఎస్పీ గారి ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు డీఎస్పీ అధర్వంలో గాలింపు చర్యలు చేపట్టడమైనది. విచారణ చేస్తుండగా తప్పిపోయిన అమ్మాయి పై ముగ్గురు మైనర్ అబ్బాయిలు హత్యాచారం చేసి అమ్మాయిని చేతులతో గొంతు నులుమి చంపివేసినట్లు తరువాత కొంత దూరం సైకిల్ పై మరియు మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని అలాగే ఆ అమ్మాయి శవాన్ని కృష్ణా నది బ్యాక్ వాటర్ లో వారి తండ్రుల సహాయంతో శవానికి రాయి కట్టి నదిలో పడవేసినట్లు ప్రాథమిక దర్యాప్తు లో తెలిసినది.దానిపై కర్నూల్ డీఐజీ నంద్యాల జిల్లా ఎస్పీ మరియు అడ్షనల్ ఎస్పీ , ముచ్చుమర్రి గ్రామం లోనే మకాం వేసి గాలింపు చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించినారు.ఈ గాలింపు చర్యలలో సీఐ స్థాయి అధికారులను 6 టీమ్స్ గా ఏర్పాటు చేసి గజ ఈత గాళ్ల ద్వారా మరియు ఎస్ డీ ఎఫ్ మరియు ఎన్ డీ ఆర్ ఎఫ్ టీమ్, లను, 06 స్పెషల్ పార్టీ బృందాలు,డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు, టెక్నికల్ టీమ్ లను రంగం లోకి దింపి గాలింపు చర్యలు చేపట్టగా మైనర్ బాలిక ఆచూకీ లభ్యం కాలేదు.ముగ్గురు మైనర్ బాలురను వారి తల్లి తండ్రుల ద్వారా అదుపులోనికి తీసుకోవడమైనది.అలాగే ఆ అమ్మయి శవాన్ని లభ్యం కాకుండా నదిలో పడవేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తు లో తెలిసినందున కాటం. యోహన్, బొల్లెద్దుల .సద్గురుడు లను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడమైనది.పై బృందాలన్నియు అమ్మాయి ఆచూకీ కొరకు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# విద్యార్థుల తో కలిసి భోజనం చేసిన కలెక్టర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-పాణ్యం మండలం నెరవాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రిన్సిపల్ మేరీ సలోమిని ఆదేశించారు. మంగళవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నెరవాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లన్నీ భర్తీ చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పదవ తరగతిలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లన్నీటిని భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటూ విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే గిరిజన ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులను మోటివేట్ చేస్తూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలను విద్యార్థులకు ఎలాంటి లోపాలు లేకుండా అందించాలన్నారు. విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, త్రాగునీటి సౌకర్యం తదితర వసతుల కల్పనలో లోపాలు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంటుందని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.పాఠశాల గదులన్నిటిని పరిశీలిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.జిల్లా యంత్రాంగం నుండి ఏదైనా సహకారం కావాలని కలెక్టర్ అడగగా.... గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ మేరీ సలోమి రెసిడెన్షియల్ కలెక్టర్ కు నివేదించారు.

# కోట్ల ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 16 డోన్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ని డోన్ పట్టణంలోని ఆయన స్వగృహంలో బిజెపి డోన్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ నాయకత్వంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గస్థాయిలో ఉన్న పలు రకాల ప్రజా సమస్యల గురించి ఎమ్మెల్యే తో చర్చించడం జరిగినది. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కేంద్రంలోనూ మరియు రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి కాబట్టి నియోజకవర్గంలో ఉన్న అన్ని రకాల ప్రజా సమస్యలను మనమందరము కలిసికట్టుగా, ఉమ్మడిగా పరిష్కరించుకుందామని హామీ ఇస్తూ, అలాగే భవిష్యత్తులో ఎలాంటి ప్రజా సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకుని రావాలని బిజెపి నాయకులను కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొగ్గరపు నటరాజు , టిడిపి డోన్ నియోజకవర్గ



సీనియర్ నాయకులు పణిరాజు మరియు టి.ఈ కేశన్న గౌడ్ , బిజెపి నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు ఒంటెద్దు బండి కిరణ్, బిజెపి పట్టణ అధ్యక్షులు సందు రాజశేఖర్ , బిజెపి డోన్ మండల అధ్యక్షులు బొంకూరి రవికుమార్ , ఆర్పిఐసీనియర్నాయకులు హుస్సేనప్ప మాదిగ , బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బద్రి సుధాకర్ , బిజెపి నియోజకవర్గ మీడియా కన్వీనర్ ఆల శివప్రకాష్ , ఆర్పిఐ నాయకులు రమేష్ మాదిగ తదితరులు పాల్గొనడం జరిగినది.


# భక్తి శ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-నంద్యాల పట్టణంలో వెలసి ప్రపంచంలో రెండవ దేవాలయంగా ఉంటూ నిత్య పూజల్లో మొదటి స్థానంలో నిలిచిన శ్రీజగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసం పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.మంగళవారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాష్ట్ర నలుమూలలు రాజంపేట, మేడ్చల్, ఆదోని, కర్నూలు, గుంటూరు, జమ్మలమడుగు, నిమ్మకూరు, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి నంద్యాలకు చేరుకొని పట్టణంలో వెలసిన శ్రీ జగజ్జనని అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలు, నేతిమిఠాయిలు, పూలు, పండ్లు, కుంకుమ, పసుపు, చీర, రవికే, ఆకు వక్కలు తదితర పూజా సామాగ్రిని అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. మేళా తాళాలు, భజంత్రీ, కోలాట నృత్యాలతో అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారే సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు నాగపుల్లయ్య, దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు అమ్మవారి కుంకుమార్చన, దర్శనంతో పాటు వసతి, ఫలహారం, అన్నదానం కల్పించారు.

# చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16- వర్షాకాలం నేపథ్యంలోచిన్నారులు వ్యాధుల బారిన పడకుండా వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సీ సరఫరా చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఆశ వర్కర్లు పట్టణంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారని తెలిపారు . 0-5 ఏళ్లలోపు చిన్నారులు వాంతులు, విరేచనాలతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటా నికి ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190